ఐఐసీటీ వద్ద రోడ్డు విస్తరించాలి


జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: నాచారం ప్రధాన రహదారి హబ్సీగూడ చౌరస్తా నుంచి నాచారం వెళ్లే దారిలో ఐఐసీటీ గోడను విస్తరించాలని కోరుతూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి గ్రేటర్ బీఆర్ఎస్ నేత సాయిజెన్‌శేఖర్ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గోడను విస్తరిస్తే ట్రాఫిక్ సమస్య తీరుతుందని, సత్వర చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రామంతాపూర్ : వెంకట్‌రెడ్డినగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ లావణ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గోఖలేనగర్, వెంకటరెడ్డినగర్, ఆర్టీసీ కాలనీ, అయ్యప్ప స్వామి టెంపుల్, చౌదరి మెస్ తదితర ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆమె కోరారు.

30 నుంచి జోనల్ లెవల్ క్రికెట్ సెలక్షన్స్

ఉప్పల్: 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉప్పల్ జోనల్ లెవల్ క్రికెట్ సెలక్షన్స్ ఈనెల 30న నిర్వహించనున్నట్లు జోనల్ కార్యదర్శి పద్మావతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బాలురు అండర్–14, 17 ఏళ్ల విభాగాల్లో ఎంపిక జరగనున్నట్లు పేర్కొన్నారు. అండర్ 14 కి సంబంధించి విద్యార్థులు జనవరి 2012 తర్వాత, అలాగే అండర్–17లో పాల్గొనేవారు జనవరి 2009 తర్వాత జన్మించి ఉండాలన్నారు. ఒక ఏజ్ గ్రూప్‌లో ఆడిన వారు మరో గ్రూప్‌లో ఆడకూడదని స్పష్టం చేశారు. ఆసక్తి గల విద్యార్థులు స్కూల్ బోనాఫైడ్, ఫోన్ నంబర్, ఆధార్ కార్డు జిరాక్స్‌తో శనివారం ఉదయం 8.30 గంటలకు మేడిపల్లిలోని ఎంఎస్‌డీ క్రికెట్ గ్రౌండ్‌లో హాజరు కావాలని ఆమె కోరారు.

సెప్టెంబర్ 1న మహాధర్నా


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కీసర: పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న మహా ధర్నా చేపట్టనున్నట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్‌గౌడ్ అన్నారు. కీసరలోని అమరవీరుల స్థూపం వద్ద గురువారం నివాళులర్పించి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీనిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రెండేళ్లు గడుస్తున్నా అమలు చేయలేదన్నారు. ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కీసర మండలాధ్యక్షుడు చీర యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఈగ శ్రీనివాస్, రాష్ట్ర బాధ్యులు, కీసర జెడ్పీహెచ్ఎస్ హెడ్ మాస్టర్ రామ్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, గురురావు, భిక్షపతి, రాజేశ్, జిల్లా బాధ్యులు పాండురంగ విట్టల్, జనార్దన్, వెంకట్‌రెడ్డి, మహిళా బాధ్యులు జ్యోత్స్న, సుశీల, మండల బాధ్యులు సుధాకర్, ముత్యంస్వామి, అనిల్‌రెడ్డి, చంద్రారెడ్డి, రవిచంద్రశేఖర్, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో చైన్ స్నాచింగ్


బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ భాస్కర్

ఉప్పల్: చైన్ స్నాచింగ్ చేసి పారిపోయిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. టీచర్స్ కాలనీలో నివాసముంటున్న పని మనిషి మండల దాసమ్మ (41) గురువారం సాయంత్రం కల్యాణపురిలోని తెలిసిన వారి ఇంటి వద్ద సామాను తీసుకువచ్చేందుకు వెళ్లింది. ఆమెను వెంబడించిన గుర్తు తెలియని అగంతకుడు దాసమ్మ గేట్ తీసుకుని లోనికి వెళ్లగానే వెనుక నుంచి వచ్చి దాడి చేసి మెడలోని 3 తులాల బంగారు పుస్తెల తాడును లాక్కొని అప్పటికే సిద్ధంగా ఉన్న మరో వ్యక్తి వాహనంపై ఎక్కి పారిపోయారు. దీంతో బాధితురాలు ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ భాస్కర్, ఎస్ఐ మాధవ రెడ్డితో కలిసి విచారణ చేపట్టారు. చైన్ స్నాచర్ నల్లని టీ షర్టు ధరించి ఉన్నట్లు బాధితురాలు తెలిపింది.


ఉప్పల్ డీఎస్ఎల్ మాల్‌లో వక్కల గణేశ్


ఓల్డ్ మల్లాపూర్‌లో శాంతి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో..


ఎస్వీనగర్ యువ గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో..

కొలువుదీరిన గణనాథులు

ఉప్పల్, మల్కాజిగిరిలో నవరాత్రోత్సవాలు షురూ

మండపాల వద్ద భక్తుల ప్రత్యేక పూజలు | ఆకట్టుకుంటున్న వెరైటీ ప్రతిమలు


నాచారంలో ఆపరేషన్ సిందూర్ వినాయకుడు

ఉప్పల్, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గల్లీగల్లీలో ఏర్పాటు చేసిన మండపాల్లో వినాయకులను ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పలువురు పర్యావరణహితంగా మట్టి గణపతులను ఏర్పాటు చేయగా, మరికొందరు వివిధ రకాల కూరగాయలతో గణపతి ప్రతిమను తయారు చేసి తమ భక్తిని చాటుకున్నారు.

–ఉప్పల్, మల్కాజిగిరి జోన్ బృందం


వసంతపూరి కాలనీ 16-లేన్ మల్కాజిగిరిలో శ్రీవేద అసోసియేషన్ ఆధ్వర్యంలో పూజలు


కాప్రా ప్రెస్‌క్లబ్‌లో గణపతి పూజ..


దయానంద్‌నగర్‌లో మోరియా ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ..


మల్కాజిగిరి విమలాదేవినగర్‌లో ..


అల్వాల్ టీఎస్ఆర్ఆర్ ఎన్‌క్లేవ్ అసోసియేషన్‌లో..


టీఎస్ఐఐసీ కాలనీలో కార్పొరేటర్ ప్రభుదాస్..


రామంతాపూర్ నెహ్రూనగర్‌లో ..

ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన


శ్రీనగర్‌కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, అధికారులు

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ శ్రీనగర్ కాలనీలోని ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, పలు శాఖల అధికారులతో కలిసి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో డ్రైనేజీ నీరు నిల్వకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైల్వే అధికారి ప్రాంజల్, కేసరి వాణి, బ్రహ్మానందం, అన్వర్‌అహ్మద్, మల్కాజిగిరి సర్కిల్ ఈఈ లక్ష్మణ్, ఏఈ నవీన్, జలమండలి జీఎం సునీల్, డీజీఎం ఆశ్రిత, నాయకులు జేఏసీ వెంకన్న, మురుగేశ్, చిన్నయాదవ్, నవీన్‌యాదవ్, శ్రీధర్, హేమంత్, సూర్యప్రకాశ్, వేణు, శ్రీధర్, శ్రీనివాస్, వెంకటేశ్, వాసు, కాలనీవాసులు పాల్గొన్నారు.

భూదేవినగర్‌లో ఎమ్మెల్యే పర్యటన

అల్వాల్: వెంకటాపురం డివిజన్ భూదేవినగర్‌లో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి రైల్వే, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి గురువారం పర్యటించారు. భూదేవినగర్ రైల్వేస్టేషన్‌కు పాదాచారులు వెళ్లేందుకు నూతన గేట్ ఏర్పాటుకు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైల్వేస్టేషన్ దక్షిణ భాగం గుండా ప్రజలు వెళ్లేందుకు దారి కల్పించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు అధికారులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు ప్రాంజల్ కేసరి, బ్రహ్మానందం, అన్వర్ అహ్మద్, విద్యుత్ అధికారులు డీఈ సుబ్బారెడ్డి, ఏడీఈ రామాచారి, బీఆర్ఎస్ నాయకులు అనిల్‌కిశోర్‌గౌడ్, విజయ్ శేఖర్, మోసిన్, శ్రీనివాసులు, ముత్యాలు, జనార్దన్, అరవింద్, కాలనీవాసులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు మార్చండి


సీఎండీ ముషార్రఫ్ అలీతో నేతలు

బోడుప్పల్: చెంగిచర్ల రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాలను మార్చాలని కోరుతూ బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషార్రఫ్ అలీకి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎండీ సానుకూలంగా స్పందించి సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గ బీబ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

'గురుకుల కాంట్రాక్టర్లను ప్రభుత్వం పట్టించుకోవాలి'


సమావేశంలో మాట్లాడుతున్న నల్లా రాధాకృష్ణ

మల్లాపూర్: గురుకుల హాస్టళ్లకు నిత్యావసర సరకులు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్ల గోడును ప్రభుత్వం పట్టించుకోవాలని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ డిమాండ్ చేశారు. నాచారంలోని అకాడమీ కార్యాలయంలో తెలంగాణ గురుకుల కాంట్రాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ 17 ద్వారా 45 పేజీల గైడ్‌లైన్స్ ఆధారంగా నూతన టెండర్ పాలసీని తీసుకువచ్చిందని దీని ద్వారా చిన్న కాంట్రాక్టర్లకు నష్టం వాటిల్లుతుందని అలాగే బడా కాంట్రాక్టర్లు, కార్పొరేట్ వ్యవస్థలను కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కొత్త టెండర్ పాలసీని రద్దు చేసి పాత విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. నూతన జీఓ రద్దు కోసం భవిష్యత్‌లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షుడు నల్లా శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు విజయ్‌కుమార్, అమర్‌బాబు, మనోజ్ గౌడ్, అజీమ్, శివశంకర్, పృథ్వీరాజ్, షానూఫ్, శ్రీనివాస్, ఆనంద్, పుల్లయ్య, కల్యాణి, రాజు, ఫారూఖ్, వెంకన్న, లింగమూర్తి, తిరుపత్తయ్య, వెంకటేశ్, 33 జిల్లాలకు చెందిన 200 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

మారుతీనగర్ నూతన కమిటీ ప్రమాణస్వీకారం

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 24వ డివిజన్ మేడిపల్లి మారుతీనగర్ కాలనీ నూతన కమిటీ గురువారం ప్రమాణస్వీకారం చేసింది. అధ్యక్షుడిగా గూడూరు పాండురంగా రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ముత్తినేని రాజు, వైస్ ప్రెసిడెంట్‌గా నన్నపనేని సృజన, బీరప్ప, సంజీవ రెడ్డి, ట్రెజరర్‌గా వంగాల సతీశ్, సలహాదారుడిగా చంద్రమౌళి, చంద్రశేఖర్ రెడ్డి, హరికృష్ణా రెడ్డి, లీగల్ అడ్వైజర్‌గా మల్లేశ్వర రావు, కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎంపల్లి అనంత రెడ్డి, బీర్ల శంకర్, వివిధ కాలనీల అధ్యక్ష, కార్యదర్శులు హాజరై నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబు దమన పాలనకు నిదర్శనం బషీర్‌బాగ్ ఘటన'



కాప్రా: చంద్రబాబు దమన పాలనకు నిదర్శనం బషీర్‌బాగ్ ఘటన అని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్రశేఖర్ మండిపడ్డారు. బషీర్‌బాగ్ ఘటనకు గురువారం 25 ఏళ్లు పూర్తికావడంతో విద్యుత్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఏఎస్‌రావునగర్ డివిజన్ కమలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో సంస్మరణ సభ నిర్వహించి అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2000 సంవత్సరంలో నాటి చంద్రబాబు ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు అనుగుణంగా విద్యుత్ సంస్కరణ పేరిట చార్జీలను విపరీతంగా పెంచిందన్నారు. దానికి వ్యతిరేకంగా బషీర్‌బాగ్ చౌరస్తాలో రైతులు శాంతియుతంగా నిరసన తెలిపితే లాఠీచార్జి చేయించి, కాల్పులు జరిపించి ముగ్గురిని పొట్టన పెట్టుకోవడమే కాకుండా అనేకమందిని గాయపర్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీనివాస్, ఏకే దుర్గాచారి, నాగరాజు, కేకే ఉన్నీకృష్ణన్, శ్రీనివాసరావు, బాబురావు, ఆర్ఎస్ఆర్ ప్రసాద్, గణేశ్, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వీహెచ్‌పీఎస్ ఆవిర్భావ వేడుకలు


మల్కాజిగిరిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

మల్కాజిగిరి: వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) 18వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జిల్లా అధ్యక్షుడు వినయ్ ఆధ్వర్యంలో గురువారం మల్కాజిగిరి చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఇన్‌చార్జి తిప్పారపు లక్ష్మణ్, జర్నలిస్ట్ ఫోరం నాయకులు మనోహర్, వీహెచ్‌పీఎస్ నాయకులు షబానా, శాంతాబాయి, లక్ష్మి, రాము, సోను, రజిత, వెంకటేశ్, జ్యోతి, కౌసర్ బేగం, అన్నపూర్ణమ్మ, కీర్తి, ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ


విగ్రహావిష్కరణలో ఎంపీ ఈటల, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

మల్లాపూర్: మల్లాపూర్ మీర్‌పేట్ గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, మీర్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, పంజాల శ్రవణ్‌గౌడ్, గజ్జెల సత్యరాజ్ గౌడ్, అంబాల నారాయణ గౌడ్, వేములయ్యగౌడ్ తది తరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



కీసర: '100 రోజుల కార్యాచరణ ప్రణాళిక'లో భాగంగా దమ్మాయిగూడ మున్సిపాలిటీ కీసర గురుకుల పాఠశాలలో స్పెషల్ ఆఫీసర్ పుష్పలత ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి గురువారం మొక్కలు నాటి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. అలాగే డెంగీ, మలేరియా, సీజనల్ వ్యాధులు రాకుండా అవగాహన, తడి, పొడి వ్యర్థాల వేరు చేయడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకట్‌రెడ్డి, డీఈఈ బాలమురళి, మేనేజర్ వెంకటేశం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, వార్డు ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

బోడుప్పల్: మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ శ్యాంసుందర్‌రావు, మేనేజర్ ప్రవీణ్‌తో కలిసి చింతల చెరువు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. వారి వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

'ఇండ్లు లేని పేదలకు 100 గజాల స్థలం ఇవ్వాలి'

సాక్షి మేడ్చల్ జిల్లా: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సొంతిల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం 100 గజాల స్థలం కేటాయించాలని ఎంపీ ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్ వద్ద గురువారం నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉప్పల్ మండలంలోని జైపూర్ కాలనీ నాగోల్ దగ్గర పత్తులగూడ గ్రామంలో దాదాపు 2 వేల మంది కూలీలు చేసుకునే పేద ప్రజలు అసంఘటిత కార్మికులు గుడిసెలు వేసుకుజీవనం సాగిస్తున్నారని వారందరికీ ఇండ్ల పట్టాలివ్వాలన్నారు. అలాగే ఘట్‌కేసర్ మండలం కాచవాని సింగారం గ్రామంలో ప్రభుత్వ స్థలం సర్వే నంబర్ 66లో భూమి కేటాయించి, పట్టాలు ఇచ్చారు కానీ పొజిషన్ ఇవ్వలేదన్నారు. మహానగరంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన పేద ప్రజలు ఇంటి అద్దెలు చెల్లించలేక బతుకు భారమై జీవిస్తుంటే ప్రజాపాలన పేరుతో ప్రభుత్వం కోట్ల రూపాయల ప్రభుత్వ భూములను అమ్ముకుంటూ రాష్ట్రాన్ని దోపిడీ చేస్తుందని మండిపడ్డారు. బాకి రవి, ములుగు నవీన్, సోమయ్య, ఉప్పలయ్య, వెంకన్న, అయ్యన్న, ముత్తయ్య పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఉద్యోగులకు క్రీడా పోటీలు

సాక్షి మేడ్చల్ జిల్లా: జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా మేజర్ ధ్యాన్ చంద్ హాకీ లెజెండ్ జయంతిని పురస్కరించుకుని మేడ్చల్ కలెక్టరేట్ లో ఉద్యోగులకు వాలీబాల్, రన్నింగ్, చెస్, టగ్ ఆఫ్ వార్, క్రికెట్, మ్యూజికల్ చైర్, క్యారం బోర్డు వంటి క్రీడా పోటీలను జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ శాఖ గురువారం నిర్వహించింది. ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా హాజరై మాట్లాడుతూ.. క్రీడా స్ఫూర్తిని ఉద్యోగంలో కూడా పాటిస్తే మెరుగైన సేవలు అందించగలరన్నారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి, జిల్లా స్పోర్ట్స్ అధికారి జీవీ.గోపాల్ రావు, వివిధ శాఖల అధికారులు, ఏఓ రామ్మోహన్ రావు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి


రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

కీసర: భూభారతి సదస్సులో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. కీసర తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో పరిష్కారం కానీ దరఖాస్తులను వెంటనే ప్రభుత్వానికి విన్నవించి నిబంధనల ప్రకారం పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. అలాగే కులం, స్థానికత, ఆదాయం, ఇతర సర్టిఫికెట్లను నిర్దేశించిన సమయంలోగా జారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కీసర ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి, తహసీల్దార్ అశోక్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ అశ్విన్‌కుమార్, ఆర్ఐ విశ్వనాథ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కూచిపూడి నృత్య పోటీల్లో చిన్నారుల ప్రతిభ


అవార్డు, ప్రశంసా పత్రాలతో చిన్నారులు

బోడుప్పల్: జాతీయ స్థాయిలో నిర్వహించిన 'సృజనోత్సవ్ 2025' పోటీల్లో చెంగిచర్లకు చెందిన చిన్నారులు ప్రతిభ చాటినట్లు మేడ్చల్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ బలరాం అన్నారు. చెంగిచర్ల జయశ్రీ కాలనీలోని శ్రీశారద కళా నిలయం నాట్య గురువు నాయిని సుప్రజ ఆధ్వర్యంలో గుంటూరులో జరిగిన నృత్య పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన చిన్నారులకు అవార్డులు, ప్రశంసా పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి చిన్నారుల కోసం సుప్రజ సంస్థను స్థాపించి చిన్నారులకు నృత్యంలో శిక్షణ ఇవ్వడం ప్రశంసనీయమన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గురువారం లభ్యమైంది. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్ వుడామి స్కూల్ సమీపంలో ఓ వ్యక్తి పడిపోయి ఉన్నట్లు స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా అప్పటికే అతడు మృతి చెంది ఉన్నాడు. ఎలాంటి ఆధారాలు లభించలేదు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు.